కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో?

- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- పరిశీలన పేరుతో ఉన్నవి తొలగింపు
- నాలుగు నెలల్లో 4 వేలకు పైగా పింఛన్ల నిలుపుదల


ఇటీవల ముచ్చర్లవలసలో జరిగిన గ్రామ సందర్శనలో నూతన పింఛను కోసం అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వృద్ధుడు

రామభద్రపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. ఇంతవరకు కొత్త పింఛన్లు మంజూరుపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబరు 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వంలోని నాయకులు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్కరికి కూడా పింఛను మంజూరు చేయలేదు. ఇటీవల వంద రోజుల పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ కూటమి నేతలు ప్రచారం చేసుకోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఒక్క హామీని కూడా అమలు చేయకుండా 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని సర్వత్రా చర్చించుకుంటున్నారు.

నాలుగు నెలల్లో 4వేలకు పైగా..

గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా మే నెలలో 2,82,194 మందికి పింఛన్లు మంజూరు చేసి డబ్బులు పంపిణీ చేయగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూన్ నెలలో 2,81,713 మందికి, జూలైలో 2,80,352 మందికి, ఆగస్టులో 2,79,361 మందికి, సెప్టెంబరు నెలలో 2,78,240 మందికి పంపిణీ చేశారు. ఒక్కో నెలలో సుమారు వెయ్యి మందికి చొప్పున నాలుగు నెలల్లో సుమారు 4 వేలకు పైగా పింఛన్లు తొలగించారు. వారిలో మృతులతో పాటు అర్హులైన వారు కూడా ఉన్నారు. ఇంకా అనర్హులున్నారనే నెపంతో పరిశీలన పేరుతో మరికొంత మంది పింఛన్లు తొలగించేందుకు చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా..

వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రోజూ పదుల సంఖ్యలో అర్హులు గ్రామాల్లోని సచివాలయాలకు వెళ్తున్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్ తెరవకపోవడంతో వారంతా నిరాశగా వెనుతిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమాల్లో నూతన పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ పలువురు అర్హులు అధికారులకు వినతులు అందజేశారు. కొత్త పింఛన్లు ఎప్పటి నుంచి మంజూరు చేస్తారనే విషయంపై అధికారులు కూడా స్పష్టమైన సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

గతంలో పక్కాగా పథకాలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ పథకం పక్కాగా అమలయ్యేది. పింఛన్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందించే వారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికల్లో నోటిఫికేషన్ తర్వాత ఆగిన వెబ్‌సైట్ కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలవుతున్నా నేటికీ ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

తొలగించేందుకు కుట్ర..



కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లు ఎలాగైనా తొలగించాలని కూటమి ప్రభుత్వ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. త్వరలో గ్రామసభలు నిర్వహించి అనర్హత పేరుతో పింఛన్లు తొలగిస్తారని సాగుతున్న ప్రచారంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పుడు అర్హులైన వారు ఇప్పుడెలా అనర్హులవుతారు. రాజకీయ కక్షతో పేదల కడుపు కొట్టేందుకు సిద్ధపడడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు తీసుకోకుండా నూతన పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ద్వర్రు పైడిరాజు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, రామభద్రపురం

నవంబరులో వెబ్‌సైట్ ఓపెన్ అయ్యే అవకాశం..



అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకునేందుకు నవంబరు నెలలో వెబ్‌సైట్ ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ఆ నెలలోనే వేరే మండల అధికారులు ఈ మండలానికి వచ్చి తనిఖీలు చేపట్టి అర్హులు, అనర్హులను గుర్తిస్తారు. గ్రామసభల దృష్టికి తీసుకెళ్లి అభ్యంతరాలు పరిశీలించి సరిచేస్తారు.

– రత్నం, ఎంపీడీఓ, రామభద్రపురం

క్లుప్తంగా

దశావతారాల విగ్రహాల ఏర్పాటు


ఆలయ ప్రహరీపై ఏర్పాటు చేసిన విగ్రహాలు

రాజాం: పట్టణంలో చీపురుపల్లి రోడ్డులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయం వద్ద విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. కొన్నాళ్లుగా ఆలయ ప్రహరీపై తొమ్మిది విష్ణుమూర్తి అవతారాల విగ్రహాల ఏర్పాటు చేస్తుండగా, ఆదివారం వాటికి ఆలయ అర్చకులు పీసపాటి సూర్యనారాయణస్వామి, రవిస్వామి, శ్రీనివాసరావుస్వామిలు శాస్త్రోక్త పూజలు చేసి, ప్రాణప్రతిష్ట చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వాటిని ప్రతిష్ఠించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్తా శ్రీనివాసరావు, సీమకుర్తి ప్రసాద్ తెలిపారు.

గొప్ప నవల వంశవృక్షం


మాట్లాడుతున్న సాహితీవేత్త శ్రీనివాసరావు

రాజాం సిటీ: కన్నడ రచయిత ఎస్.భైరప్ప రాసిన వంశవృక్షం నవల చాలా గొప్ప నవల అని సాహితీవేత్త పాదిలాపు శ్రీనివాసరావు ప్రశంసించారు. స్థానిక వేదగాయత్రి కళాశాలలో ఆదివారం జరిగిన రాజాం రచయితల వేదిక 117వ సమావేశంలో వంశవృక్షం నవలపై ఆయన విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. సనాతన ధర్మం, ఆధునిక సంప్రదాయం మధ్య జరిగిన సంఘర్షణలను రచయిత నవల ద్వారా చక్కగా వివరించారన్నారు. నవలలోని పాత్రల మానసిక సంఘర్షణల ద్వారా పాఠకునిలో సాంఘిక చైతన్యం కలిగించడమే రచయిత ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో రౌతు గణపతిరావునాయుడు, గార రంగనాథం, పెంకి దయానిధినాయుడు పాల్గొన్నారు.

గౌరీదేవికి కలశదీప పూజలు


కర్ణివీధిలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

రామభద్రపురం: మండలంలోని ఆదివావారం నందీశ్వరునికి, గౌరీదేవికి భక్తులు కలశాల్లో దీపాలు వెలిగించి పూజలు చేశారు. మండల కేంద్రంలోని మామిడివీధి, పాండూరు వీధి, మెయిన్‌రోడ్డు, అగురు వీధి, శ్రీరాంనగర్ కాలనీ, పరిసర గ్రామాలైన బూసాయవలస, ఆరికతోట, కొత్తరేగ, నాయుడువలస తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన నందీశ్వరునికి భక్తులు పూజలు చేశారు. ఆయా గ్రామాలలో మహిళలు కలశాల్లో దీపాలు వెలిగించి గౌరీదేవికి, నందీశ్వరునికి సమర్పించారు. ప్రకృతి సహకరించి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


రాజయ్యపేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని రాజయ్యపేట, కంచరాం, పొగిరి తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణపై క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, ప్రజారోగ్య సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం ఎస్సీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు తరలి రావాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య పిలుపునిచ్చారు. రఘురామకృష్ణంరాజు ఎమ్మెల్యేగా ఉంటూ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించడం, పంతం నానాజీ దళిత ప్రిన్సిపాల్‌ను అవమానించడం, మద్యం షాపుల కేటాయింపులో ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, తదితర అంశాలకు నిరసనగా ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. దళితులంతా ఏకమై ధర్నాకు తరలిరావాలని ఆయన కోరారు.

సాగునీరు సరఫరా చేయండి

వంగర: తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా శివారు గ్రామాలకు సాగునీరు సరఫరా చేయాలని మండలంలోని మద్దివలస గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత 15 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు నాశనం అవుతున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి, కాలువ ఎగువ ప్రాంతాల్లో తక్షణమే మరమ్మతులు చేపట్టి సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి


బహుమతులు పొందిన విద్యార్థులతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని వికాస తరంగిణి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నీతిపద్యాల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులతో నీతిపద్యాలు కంఠస్తం చేయించడం ద్వారా మంచి నడవడిక, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అలాగే మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మెమెంటోలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, గెడ్డాపు శ్రీలక్ష్మి, ఎస్.శ్రీలక్ష్మి, కె.శంకరరావు, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 30 మంది ఎంపిక


వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న సిబ్బంది

సంతకవిటి: స్థానిక శ్రీసత్యసాయిబాబా మందిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 60 మంది నేత్రాలను వైద్యులు తనిఖీ చేసి, వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరందరికీ విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. ఈ మేరకు వారిని సాయంత్రం ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో యాలాల శ్రీనివాసరావు, పాట్నూరు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారానికి గేట్లు తెరిచిన ప్రభుత్వం


మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: మద్యం విచ్చలవిడి వ్యాపారానికి కూటమి ప్రభుత్వం గేట్లు బార్లా తెరిచిందని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలు ఒక నిర్దిష్ట సమయాల్లో జరిగేవన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో మద్యం అమ్మకాలకు అడ్డూఅదుపూ లేదన్నారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్నారు. ఇటువంటి వాటిని పోలీసులు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

ముగిసిన 'పల్లె పండగ'


నరసాపురంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

రామభద్రపురం: మండలంలో నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈఓపీఆర్డీ వెంకటరమణ ఆధ్వర్యంలో పాతరేగ, కొత్తరేగ, నరసాపురం, దుప్పలపూడి తదితర గ్రామాల్లో ఆదివారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ


సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

బొబ్బిలి రూరల్: మండలంలోని రంగరాయపురం గ్రామంలో రూ.17.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి ఆదివారం స్థానిక సర్పంచ్ ఉడుముల గోవిందరావు, ఎంపీటీసీ చొక్కాపు నారాయణరావు ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.రవికుమార్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు

రాజాం: మండలంలోని కొత్తపేట గ్రామంలో నందెన్న ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏటా ఇక్కడ జరిగే ఈ వేడుకలు 19 రోజుల పాటు కొనసాగిస్తూ రోజుకో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తుంటారు. మండపంలో కొలువైన గంగాగౌరీ సమేత నందెన్నను భక్తులు ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ కష్టాలు?


రామభద్రపురం అంతరరాష్ట్ర కూడలిలో ఉదయం 7 గంటల సమయంలో స్తంభించిన ట్రాఫిక్


గ్రామం మధ్య నుంచి వెళ్తున్న భారీ లారీ

రామభద్రపురం: మండల కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటలు వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ సర్వసాధారణమైపోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు మండల కేంద్రం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే చుట్టుపక్కల మండలాలకు చెందిన వాహనాలు ఇటువైపు నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే ఉదయం పూట రైతులు కూరగాయలను మార్కెట్ తీసుకురావడం, స్కూల్ బస్సులు, ప్రైవేటు వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు, ఇంటి నిర్మాణ యజమానులు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించుకోవడంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. సాలూరు– ఒడిశాకు రాకపోకలు సాగించేందుకు బైపాస్ రోడ్డు సౌకర్యం ఉన్నా కూడా గ్రామం మధ్య నుంచే భారీ వాహనాలు సాలూరు వైపు వెళ్లడంతో చుట్టుపక్కల నివాసాల వారికి, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆటో డ్రైవర్లు ఎక్కడిపడితే అక్కడ వాహనాలు నిలిపివేయడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణం. కొన్ని సందర్భాలలో అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ట్రాఫిక్ సమస్య పోలీసులకు ప్రతినిత్యం తలనొప్పిగా మారింది.

నాలుగు నెలల్లో రోగాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు..

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో రోగాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అటు అక్షరాస్యతలోనూ ఇటు ఆరోగ్యంలోనూ దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం విద్యావ్యవస్థను, ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడే కలుషిత నీటిని తాగి ప్రజలు రోగాలబారిన పడితే కనీసం వారిని పట్టించుకోవడం లేదన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు, ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యమిచ్చారో అందరికీ తెలుసన్నారు. విజయవాడ వరదల దగ్గర నుంచి, గుర్లలో ఇటీవల సంభవించిన డయేరియా మృతుల వరకు ప్రతిచోటా ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందన్నారు. కోవిడ్ విపత్తు సమయంలోనూ ఏ ఒక్కరినీ సాయం అడగకుండా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించి, ప్రతి ఇంటికీ రూ.వెయ్యి నగదు, ఉప్పులు, పప్పులు, కూరగాయలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు విజయవాడ వరద బాధితుల కోసం అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు కొనుగోలు చేశామని చెప్పి, కోట్లాది రూపాయలు దోచేశారని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో ఎంతోమంది నిరుపేదలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అసలు మద్యం అంటేనే హానికరమని, అలాంటిది నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పడం ఓ రకంగా తాగుడును ప్రోత్సహించడమేనన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానేసి, ప్రజలకు మంచి చేయాలని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని హితవు పలికారు. ఆయన వెంట పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసనాయుడు తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

రేగిడి: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నీలావతి హెచ్చరించారు. మండలంలోని వెంకటాపురం, సంకిలి, బొడ్డవలస తదితర గ్రామ నదీతీరాలను ఆదివారం పరిశీలించారు. రాత్రి సమయంలో ఖండ్యాం నదీతీర ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం ఉందని, ఎక్కడైనా పట్టుబడితే అపరాద రుసు విధించడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం

రాజాం సిటీ: స్థానిక గాయత్రి కాలనీ ఎదురుగా ఉన్న సాయినగర్‌లో ఉచిత యోగా శిక్షణ ఆదివారం ప్రారంభమైందని యోగా గురువు టీటీవీ రమణమూర్తి తెలిపారు. యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా ఎన్నో అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు రిజిస్ట్రేషన్లు

రేగిడి: దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి గ్రామాల్లో పాలకొండకు చెందిన గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఆదివారం వచ్చి, గ్యాస్ వినియోగదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. గ్యాస్ లబ్ధిదారుల ఫోన్ నంబర్లను గ్యాస్ ఐడీ నంబర్‌లకు లింక్ చేశారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

రేగిడి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎల్లారావు కోరారు. ఇదే విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో జరిగిన భూ రీసర్వేలో నెలకొన్న పొరపాట్లు ఈ గ్రామసభల్లో సరిచేయడం జరుగుతుందన్నారు. భూ సమస్యలున్న రైతులంతా సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్థికసాయం దరఖాస్తుపై విచారణ


బాధితురాలి వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: తన భార్య అనారోగ్యంతో బాధపడుతోందని, ఆమెకు చికిత్స అందించేందుకు అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ తెర్లాంకు చెందిన బెలగాపు చిన లక్ష్మణ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును విచారణ చేసి అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి వివరాలు పంపించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు డిప్యూటీ సీఎం పేషీ నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణవేణి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు సమక్షంలో వివరాలు సేకరించారు. నివేదికను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేషీకి పంపించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయనతో పాటు ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్ఓ శకుంతల ఉన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి


విద్యార్థితో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులకు పుస్తక పఠనం ఏలా చేయాలో లైబ్రేరియన్ నేర్పించారు. పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పొందవచ్చని, విద్యార్థులు ప్రతీరోజు పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాణించాలన్నారు. అలాగే విద్యార్థులంతా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

హెల్త్ సబ్‌సెంటర్ పరిశీలన


మెట్టవలసలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన


బొబ్బిలిరూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలసలో ఉన్న హెల్త్ సబ్‌సెంటర్‌ను ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న సబ్‌సెంటర్‌లోని సౌకర్యాలను, రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారి వంశీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని వైద్యులు ఎమ్మెల్యేను కోరారు. సబ్‌సెంటర్ పరిధిలోని సుమారు 15 గ్రామాల రోగులకు వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ తీసుకోవాలని కోరారు. త్వరలోనే మరమ్మతులకు అవసరమైన నిధులను కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పట్టణంలోని ఫ్లెటైవర్ బ్రిడ్జిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ, అరసాడ విశాల్ మృతి చెందారు. మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం త్వరగా వచ్చేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు కావాలి

- మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు


మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులునాయుడు

బొబ్బిలి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నవంబర్ 6లోగా ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు కావాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. స్థానిక చైతన్య స్కూల్‌లో ఆదివారం వివిధ ఉపాధ్యాయ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెండుసార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసినప్పుడు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానన్నారు. పలు జీవోల విడుదల త్వరితగతిన జరిగేలా చొరవచూపినట్లు చెప్పారు. పీఆర్టీయూ, దాని మిత్ర సంఘాలతో తాను ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో దిగుతున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయుల పేరెంట్స్ చనిపోయినప్పుడు 15 రోజులు సెలవులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే హెల్త్ కార్డులను సింగిల్‌విండో పద్ధతిలో వినియోగానికి పనికి వచ్చేలా రూపొందించేందుకు చొరవ చూపుతానన్నారు. సంఘ నాయకులు వాలేటి తవిటినాయుడు, డి.శ్రీనివాసరావు, బి.శివప్రసాద్, గంట శశికుమార్, రావాడ రాంబాబు, శివరామ్, గౌరీశంకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.